నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, బుధవారం 17 జూలై 2024 | VIKARABAD


ఎమ్మెల్యేను కలిసిన షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం..

మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి

ఎమ్మెల్యేను కలిసిన షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు

షాబాద్, జూలై 16: బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలెవరూ అధైర్య పడొద్దని, ఎల్లప్పుడూ అండగా ఉంటామని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని ఆమె నివాసంలో షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి వెళ్లి సబితారెడ్డితో పాటు రాష్ట్ర యువనాయకుడు కార్తీక్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వంలో ప్రజలు, నిరుద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొంత మంది నాయకులు పార్టీని వీడినంత మాత్రాన నష్టం లేదన్నారు. లక్షల మంది కార్యకర్తలు కేసీఆర్ వెంటే ఉన్నారని గుర్తు చేశారు. చేవెళ్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసే వారికి భవిష్యత్తులో మంచి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తూతూ మంత్రంగా పథకాలను అమలు చేస్తున్నదని విమర్శించారు. పంట రుణమాఫీ చేస్తామంటున్న కాంగ్రెస్ పార్టీ తిక్కతిక్క నిబంధనలు పెడుతూ రైతులను ఆందోళనకు గురిచేస్తున్నదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి రైతుకూ రుణమాఫీ చేశారన్నారు. గత ప్రభుత్వం వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చిందని, సాగునీటికి, పెట్టుబడికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవడంతో వ్యవసాయం పండుగలా మారిందన్నారు. ప్రస్తుతం వర్షాలు సరిగ్గా లేక ఏ చెరువును చూసినా సరిపడా నీళ్లులేవని, భూగర్భజలాలు అడుగంటిపోయాయన్నారు. చేవెళ్ల ప్రాంత ప్రజలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని, ఎవ్వరూ లేరని మీరు ఎప్పుడూ అనుకోవద్దన్నారు. బీఆర్ఎస్ పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తున్న యువ నాయకుడు అవినాశ్‌రెడ్డికి మీరంతా మద్దతుగా నిలవాలని కోరారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసిన వారిలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడూరు నర్సింగ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు కొలన్ ప్రభాకర్‌రెడ్డి, ఎండీ చాంద్‌పాషా, సూద యాదయ్య, మాజీ సర్పంచ్‌లు పీ దర్శన్, కావలి మల్లేశ్, ర్యాకల శేఖర్, ఈదుల కృష్ణగౌడ్, దేవేందర్‌రెడ్డి, పార్టీ నాయకులు గంగిడి భూపాల్‌రెడ్డి, కొండా రాజుగౌడ్, అవినాశ్‌గౌడ్, గోపాల్, రామస్వామి, ప్రశాంత్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

మోకిల్లలో..

చేవెళ్ల రూరల్ : నాయకులు, కార్యకర్తలే పార్టీకి ముఖ్యమని ఎలాంటి పని ఉన్నా.. ఇబ్బందులు ఉన్నా తెలిపితే వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం శంకర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సభావత్ రాజూ నాయక్‌ను మోకిల్ల గ్రామంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి కలిసి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ కొంతమంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరినా నష్టం ఏమీ లేదని, రాబోవు రోజుల్లో వారికి తగిన గుణపాఠం తప్పదన్నారు. తొలి సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌కు పూర్వవైభవం తీసుకొచ్చేలా బీఆర్ఎస్ శ్రేణులు సైనికుల్లా పని చేయాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుందన్నారు. మాజీ మంత్రి వెంట శంకర్‌పల్లి మండల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

దోమలోని పెద్ద చెరువు

కులకచర్లలోని మైలమ్మ చెరువు

జలకళ!

వర్షాలు లేక వట్టిపోయిన ప్రాజెక్టులు, మైదానాలుగా చెరువులు

ఈ ఏడాది వానకాలం ఎనుకపట్టు పట్టింది. గతంలో జూన్, జూలైలోనే చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు మత్తడి దుంకాయి. ఎవుసం పండుగలా సాగింది. కానీ ఈ వానకాలం చుట్టపుచూపులా అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. ఇటీవల అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసినా ఏ ఒక్క చెరువులోకీ కొంతమేరైనా నీరు చేరలేదు. వికారాబాద్ జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులు, చెరువులు నీటినిల్వలు లేక నెర్రెలుబారిన దృశ్యాలు దర్శనమిస్తున్నాయి. అన్నదాతలు ఆకాశం వైపు చూడాల్సిన పరిస్థితులు వస్తున్నాయి. గత కాలానికి.. ప్రస్తుత పరిస్థితులను గుర్తు చేసుకుంటే అంతా కలలా ఉన్నదని రైతన్నలు వాపోతున్నారు. జూన్‌లో ఒకట్రెండు సార్లు మోస్తరు వర్షాలు మినహా పెద్దగా వానలు కురిసింది లేదు. జూలై నెలలో గత రెండు, మూడు రోజులుగా మోస్తరు వర్షం కురుస్తుండడంతో భూమి తడిగా మారింది తప్ప చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు ఉన్నాయన్న భరోసా, భూగర్భ జలాలు పెరిగాయన్న ధీమా లేదని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని ఒక్క చెరువు కూడా వంద శాతం నిండిన దాఖలాలేదు.

- వికారాబాద్, జూలై 16 (నమస్తే తెలంగాణ)

వానకాలం ప్రారంభమై రెండు నెలలు ముగియవస్తున్నా వర్షాలు మాత్రం దోబూచులాడుతున్నాయి. సరైన వానలు లేక చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు కళావిహీనంగా కనిస్తున్నాయి. వికారాబాద్ జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులైన కోట్‌పల్లి, లక్నాపూర్, సర్పన్‌పల్లి, కాకరవేణి, జుంటుపల్లి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు క్రమంగా తగ్గుతూ వస్తుండడంతో జలకళ తప్పాయి. ఈ వానకాలంలో సరైన వర్షాలు లేకపోవడంతో ఏ చెరువు, కుంట, ప్రాజెక్టును చూసినా 25 శాతం మేర కూడా నీటినిల్వలు లేవు. మరోవైపు మూసీ, ఈసీ నదుల్లో ముళ్లపొదలు దర్శనమిస్తున్నాయి. జిల్లాలోని దాదాపు అన్ని మండలాల్లో సాధారణానికి మించి అధిక వర్షపాతం నమోదైనప్పటికీ రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదు కాలేదు. జిల్లాలోని అన్ని మండలాల్లో పెద్దగా వర్షాలు లేకపోవడంతో భూగర్భజలాలు కూడా పెరుగలేదని సంబంధిత అధికారులు వెల్లడించారు. జిల్లాలో భూగర్భజలాలకు సంబంధించి మే నెలలో 15.68 మీటర్ల లోతులో భూగర్భజలాలుండగా, జూన్‌లో 13.35 మీటర్లలో, జూలైలో కూడా పెద్దగా వర్షాలు లేకపోవడంతో 13 మీటర్లలోనే ఉండడంతో భూగర్భజలాల్లో ఎలాంటి మార్పు లేదు.

దోమ మండలంలోని ఐనాపూర్ చెరువు

ఒక్క చెరువు కూడా సగమైనా నిండలే..

జిల్లావ్యాప్తంగా 1179 చెరువులుండగా, 85 వేల ఎకరాల ఆయకట్టు విస్తరించి ఉన్నది. తాండూరు డివిజన్‌లో 262 చెరువులు, కొడంగల్ డివిజన్‌లో 202 చెరువులు, పరిగి డివిజన్‌లో 398 చెరువులు, వికారాబాద్ డివిజన్‌లో 317 చెరువులు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 1179 చెరువులున్నప్పటికీ ప్రధానంగా 385 చెరువులు ఉన్నాయి. ఈ ప్రధాన చెరువుల్లో కేవలం ఒకే ఒక్క చెరువులో మాత్రమే 50 శాతానికిపైగా నీటినిల్వలు ఉండగా, మిగతా 384 చెరువుల్లో 25-50 శాతం లోపు మాత్రమే నీటినిల్వలు ఉన్నాయి. 25-50 శాతం మేర నీటినిల్వలు 361 చెరువుల్లో ఉండగా, 25 శాతంలోపు నీటినిల్వలు 21 చెరువుల్లో ఉన్నాయి.

ఆందోళనలో అన్నదాతలు..

జిల్లాలో వానకాలం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు భారీ వర్షం కురిసిన దాఖలాలు లేవు. జూన్ నెలలో పెద్దగా వర్షాలు కురవకపోయినా గత రెండు, మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయనే సంతోషమే తప్ప పెద్ద వర్షాలు లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వానకాలం ప్రారంభంలో కురిసిన ఒక్క వానకే తొందరపడి విత్తనాలు నాటిన రైతులకు ఆ తర్వాత వర్షాలు లేకపోవడంతో నష్టపోవాల్సి వచ్చింది. తదనంతరం వారం, పది రోజుల క్రితం మళ్లీ విత్తనాలను నాటినప్పటికీ ఇంకా వర్షం దోబూచులాడుతుండడంతో జిల్లా రైతాంగం అయోమయంలో పడింది. కేవలం ఒక ట్రెండు మండలాలు మినహా మిగతా మండలాల్లో అంతంత మాత్రంగానే వర్షపాతం నమోదైంది. జూన్, జూలై నెలల్లో సాధారణానికి మించి వర్షపాతం నమోదైందని చెప్పుకోవడానికి తప్ప ఏ మాత్రం భూగర్భజలాలు పెరగకపోవడం బాధాకరం.

- 25 శాతం కూడా నిండని కోట్‌పల్లి, లక్నాపూర్, సర్పన్‌పల్లి, కాకరవేణి ప్రాజెక్టులు
- జిల్లాలోని ప్రధాన చెరువుల్లో ఒక్క చెరువులో కూడా లేని 50 శాతం నీటినిల్వలు
- జిల్లావ్యాప్తంగా 1179 చెరువులు
- జూలై ముగుస్తున్నా ఒక్క చెరువు కూడా అలుగుపారలేదు..
- వికారాబాద్ జిల్లాలో ఓ మోస్తరుగా కురిసిన వర్షాలు
- నీటినిల్వలు లేక కళ తప్పిన చెరువులు, కుంటలు

కులకచర్ల మండలంలోని కాముని చెరువు



భూముల రక్షణకు టాస్క్‌ఫోర్స్..

- జిల్లాలో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములు మాయం
- అక్రమార్కుల చెరలో చెరువులు, కుంటలు
- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోనూ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు
- భూ ఆక్రమణలకు చెక్ పెట్టేలా కలెక్టర్ శశాంక చర్యలు
- జిల్లాలో ఆక్రమణల తొలగింపునకు రెండు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాల ఏర్పాటు
- త్వరలోనే మొదలుకానున్న కార్యాచరణ

రంగారెడ్డి, జూలై 16(నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లాలో భూములకు డిమాండ్ పెరగడంతో కబ్జాదారులు ప్రభుత్వ భూములపై కన్నేస్తున్నారు. చివరకు చెరువులు, గుట్టలను సైతం వదలడం లేదు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని భూములను సైతం ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. ఫలితంగా జిల్లాలో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములు హారతి కర్పూరంలా కరిగిపోతున్నాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో రంగారెడ్డి కలెక్టర్ శశాంక ప్రభుత్వ భూములపై నజర్ పెట్టారు. వాటి పరిరక్షణ దిశగా చర్యలకు ఉపక్రమించారు. ఈ క్రమంలోనే వివిధ శాఖల అధికారులతో రెండు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణ త్వరలోనే మొదలుకానుండగా.. ఆయా బృందాలు ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టనున్నాయి.

కబ్జాకు కాదేదీ అనర్హం..

జిల్లాలో ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోయింది. హైదరాబాద్‌కు ఆనుకుని ఉన్న రంగారెడ్డి జిల్లాలో మారుమూల ప్రాంతంలోనూ వంద గజాల స్థలం రూ.20లక్షల నుంచి రూ.కోట్లలో ధర పలుకుతున్నది. రేట్లు ఆకాశాన్నంటడంతో అక్రమార్కుల కన్ను ప్రభుత్వ భూములపై పడింది. కబ్జాకు కాదేదీ అనర్హం అన్నట్లు.. అసైన్డ్, భూదాన్, పొరంబోకు, అటవీ.. భూముల్లో కబ్జా కాండను సాగిస్తున్నారు. చెరువులు, కుంటలు సైతం ఆక్రమణదారుల గుప్పిట్లో బందీ అయ్యాయి. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ వంటి పరిధిలోని స్థలాలకు సైతం అధికారులు ఎన్‌వోసీ, ఎల్పీ నంబర్లను జారీ చేస్తుండడంతో నీటి వనరుల ఆనవాళ్లే లేకుండా పోతున్నాయి. అధికారుల ఉదాసీనత కారణంగా ఇప్పటికే రూ.కోట్ల విలువైన ఎన్నో భూములు ఆక్రమణదారుల చెరలో చిక్కుకున్నాయి. మహేశ్వరం, కందుకూరు, ఇబ్రహీంపట్నం, హయత్‌నగర్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, శంషాబాద్, గోపన్‌పల్లి తదితర ప్రాంతాల్లో భూములకు ఉన్న డిమాండ్ తరహాలోనే ఆక్రమణలు సైతం ఉంటున్నాయి. ఇతర ప్రాంతాల్లోనూ ఇదే బాగోతం.. చాలా చోట్ల వీటి వెనుక కొంతమంది ప్రజాప్రతినిధులు ఉన్నట్లు ఆరోపణలున్నాయి. కొన్ని చోట్ల రెవెన్యూ అధికారుల అండదండలతో భూ దందా నిర్విఘ్నంగా కొనసాగుతున్నదని విమర్శలున్నాయి. మున్సిపాలిటీలుగా అప్‌గ్రేడ్ అయిన చోట్ల జీపీ పర్మిషన్లతో అక్రమ తంతును సాగిస్తున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు.

పటిష్ట కార్యాచరణతో ఆక్రమణల గుర్తింపు..

ఇకపై ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవ్వకుండా పకడ్బందీ చర్యలు చేపట్టే దిశగా అధికార యంత్రాంగం సమాయత్తమవుతున్నది. ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్న కబ్జాదారులపై కలెక్టర్ శశాంక ఉక్కుపాదం మోపుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అక్రమ నిర్మాణాల కూల్చివేత వంటి సాహసోపేత నిర్ణయాలు తీసుకుని అమలు చేస్తున్నారు. భవిష్యత్తులోనూ ఇదేరీతిన కఠినంగా ఉండాలని ప్రతి సమావేశంలోనూ రెవెన్యూ అధికారులకు కలెక్టర్ సూచిస్తున్నారు. ఓ పక్క జియోట్యాగింగ్‌తో ప్రభుత్వ భూముల హద్దులను ఖరారు చేసే ప్రక్రియ జిల్లాలో కొనసాగుతుండగా.. తాజాగా ఆక్రమణలను నిరోధించేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఏసీపీ స్థాయిలో రెండు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశారు. ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాలకు ఒక బృందాన్ని, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, షాద్ నగర్, చేవెళ్ల నియోజకవర్గాలకు మరో బృందాన్ని ఏర్పాటు చేశారు. రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, మున్సిపల్ కమిషనర్, హెచ్ఎండీఏ లేక్స్, పంచాయతీ, విద్యుత్, సర్వే సిబ్బంది తదితర అధికారులు టాస్క్‌ఫోర్స్ బృందంలో ఉంటారు. అక్రమార్కుల చెర నుంచి ప్రభుత్వ భూములకు విముక్తి కల్పించేందుకు ఈ బృందాలు పటిష్ట కార్యాచరణను అవలంబించనున్నాయి. ఆయా బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రభుత్వ స్థలాలు, చెరువులు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిల్లోని ఆక్రమణలను గుర్తించి అవసరమైన చర్యలను వెంటనే అమలు చేస్తారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల్లో ఎక్కువగా ఆక్రమణలకు సంబంధించినవే ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా ఫిర్యాదులను పరిశీలించి పరిష్కార దిశగా సంబంధిత బృందాలు కార్యాచరణను మొదలుపెట్టనున్నాయి.

కుట్టుకూలి వచ్చింది..

ఏకరూప దుస్తులకు నిధులు విడుదల

- జిల్లాకు రూ. 42.99 లక్షలు ఒక జత కుట్టుకూలి నిధులు
- మహిళా సంఘాల ఖాతాల్లో జమ చేస్తున్న విద్యాశాఖ అధికారులు

బొంరాస్‌పేట, జూలై 16 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు 2024-25 విద్యా సంవత్సరంలో ఏకరూప దుస్తులు సరఫరా చేసేందుకు ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. ఈ విద్యా సంవత్సరం సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులకు ఒక జత దుస్తులు కుట్టడానికి అవసరమైన కుట్టుకూలీ చార్జీలను పాఠశాల విద్యాశాఖ జిల్లాకు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఒక్కో జతకు రూ.50ల చొప్పున స్వయం సహాయక సంఘాల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఏకరూప దుస్తులు కుట్టడానికి అవసరమైన వస్త్రాన్ని ప్రభుత్వం సరఫరా చేసింది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వస్త్రాన్ని జిల్లా అధికారులు పాఠశాలలకు సరఫరా చేశారు. యూనిఫాం కుట్టడానికి ఎంపిక చేసిన మహిళా సంఘాలకు ఈ వస్త్రాన్ని అందజేసి ఏకరూప దుస్తులు కుట్టిస్తున్నారు. వికారాబాద్ జిల్లాలోని 1047 పాఠశాలల్లో 1 నుంచి 12 తరగతి వరకు చదువుతున్న 85,988 మంది విద్యార్థులకు ప్రభుత్వం ఏకరూప దుస్తులు కుట్టించి వాటిని విద్యార్థులకు పంపిణీ చేశారు. వీటిని కుట్టడానికి కుట్టుకూలీ నిధులు రూ.42,99,400లను ప్రభుత్వం విడుదల చేసింది. మంజూరైన నిధుల్లో 28 పీఎంశ్రీ పాఠశాలలకు రూ.5,50,350లు, 1019 పాఠశాలలకు రూ.37,49,050లు మంజూరయ్యాయి. యూనిఫాం అందినట్లు ఆయా పాఠశాలల హెచ్ఎంల నుంచి రాత పూర్వకంగా డిక్లరేషన్ తీసుకుని మహిళా సంఘాల ఖాతాల్లో కుట్టుకూలీ నిధులు జమ చేస్తున్నారు.

మహిళా సంఘాలకు యూనిఫాం కుట్టే బాధ్యతలు..

ఈ ఏడాది నుంచి యూనిఫాం కుట్టించే బాధ్యతను మహిళా స్వయం సంఘాలకు ప్రభుత్వం అప్పగించింది. వికారాబాద్ జిల్లాలోని 19 మండలాల్లో 94 మహిళా శక్తి కుట్టు కేంద్రాలను ఏర్పాటు చేసి యూనిఫాం కుట్టించారు. ఏటా రెండు జతల యూనిఫాం అందించాల్సి ఉండగా, మొదటగా ఒక జత యూనిఫాం కుట్టించి విద్యార్థులకు పంపిణీ చేశారు. 85,988 మంది విద్యార్థులకు రెండోజత కుట్టడానికి అవసరమైన 1,85,135 మీటర్ల వస్త్రం కూడా జిల్లాలోని మహిళా సంఘాలకు సరఫరా చేశారు.

కుట్టుకూలీ పెంచినా పాత ధర ప్రకారమే చెల్లింపు..

యూనిఫాం కుట్టడానికి ప్రభుత్వం ఒక జతకు రూ.50లు చెల్లించేది. ఈ ధర తమకు గిట్టుబాటు కాదని ధర పెంచాలని మహిళా సంఘాలు కోరాయి. దీంతో స్పందించిన ప్రభుత్వం కుట్టుకూలీ ధరను రూ.50 నుంచి రూ.75కు పెంచింది. కానీ మహిళా సంఘాలకు మాత్రం పాత ధర ప్రకారమే నిధులను విడుదల చేసింది. పెంచిన కూలీని కూడా తరువాత మంజూరు చేస్తారని అధికారులు పేర్కొంటున్నారు.

విద్యార్థుల ఏకరూప దుస్తులను కుడుతున్న మహిళలు(ఫైల్)